నిజాం షుగర్స్‌పై కాంగ్రెస్, బీజేపీ మోసం

బోధన్ చెరుకు ఫ్యాక్టరీకోసం గళమెత్తుతా..
నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేయిస్తా
ధర్మపురి అర్వింద్‌ను పసుపు రైతులే ఓడిస్తరు
జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా పైసా లాభం చేయలే
'నమస్తే' ఇంటర్వ్యూలో బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే నిజాం షుగర్స్ ఫ్యాక్టరీకి ఈ గతి పట్టింది. రైతులంతా సహకార సంఘంగా ఏర్పడితే కేసీఆర్ హయాంలో పూర్తిస్థాయి మద్దతు ఇచ్చి ఫ్యాక్టరీని తెరిపించేందుకు ముందు కొచ్చాం.. కానీ నాడు ఇవే కాంగ్రెస్, బీజేపీలు రైతులను తప్పుదోవ పట్టించి అడ్డుకున్నయ్. మహారాష్ట్ర తరహా రైతులకు మేలు చేసేందుకు కేసీఆర్ ఆలోచన చేశారు.' అని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ వివరించారు. 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే షుగర్ ఫ్యాక్టరీ, పసుపు బోర్డు కలసాకారమవుతుందని చెప్పారు.

ఎన్నికల ప్రచారం ఎలా కొనసాగుతున్నది?

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి అద్భుత స్పందన వస్తున్నది. బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలతో వీలైనంత ఎక్కువ మందిని కలుస్తూ బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకతను వివరిస్తున్నాం. ప్రజలు కూడా బీఆర్ఎస్సే గెలవాలని కోరుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా కేసీఆర్ పరిపాలననే గుర్తుచేస్తున్నరు. కేసీఆర్ పాలనలో మానవీయత ఉండేది. అన్ని వర్గాలవారికి ఆ లోటు స్పష్టంగా తెలుస్తున్నది. బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో మా ఎమ్మెల్యేలే ఉన్నరు. ముఖ్య విషయం ఏమిటంటే అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం ఓట్లను పరిశీలిస్తే ఇతర పార్టీల కన్నా బీఆర్ఎస్‌కే ఎక్కువ వచ్చాయి.

ఎంపీ అర్వింద్ మళ్లీ పసుపుబోర్డు అంటున్నడు కదా?

ఇచ్చిన హామీని నెరవేర్చని దద్దమ్మ ధర్మపురి అర్వింద్. తాను గెలిస్తే ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు తెస్తానని చెప్పి రైతులను మోసం చేసిండు. స్వయంగా ప్రధాని మోదీతో ప్రకటన చేయించి ఇప్పటికీ అతీగతీ లేదు. అందుకే పసుపు రైతులు అర్వింద్‌పై కోపంతో ఉన్నరు. వారే బీజేపీని ఓడించబోతున్నరు. పసుపు బోర్డు ఎక్కడుందో చూపించే దమ్ముందా? ఇది మరో ఎన్నికల గిమ్మిక్కు మాత్రమే. కాంగ్రెస్ పార్టీ కూడా రైతులను నిలువునా దగా చేస్తున్నది. రైతుబంధును సక్రమంగా ఇవ్వలేదు. సాగునీటి కోసం రైతులను గోసపెట్టింది. వడ్లకు రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి చేతులెత్తేసింది. ఇది రైతుల్లో రేవంత్ సర్కారుపై అసంతృప్తిని పెంచింది. ఈ ఎన్నికల్లో రైతులు బీఆర్ఎస్ వెంటే ఉంటరు.

చెరుకు ఫ్యాక్టరీపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎలాంటి నాటకాలాడి ఓట్లు రాబట్టుకున్నదో అందరికీ తెలుసు. లోక్‌సభ ఎన్నికల్లోనూ అవే మాయ మాటలు చెప్తున్నది. బోధన్ షుగర్ ఫ్యాక్టరీపై అబద్ధపు హామీలిస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే కదా ఫ్యాక్టరీకి ఈ గతి పట్టింది. దాన్ని తెరిపించడంపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు. కేసీఆర్ హయాంలో రైతులంతా కలిసి సహకార సంఘంగా ఏర్పడితే పూర్తిస్థాయి మద్దతిచ్చి నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ముందు కొచ్చాం. కానీ అప్పుడు ఇవే బీజేపీ, కాంగ్రెస్‌లు రైతులను తప్పుదోవ పట్టించి అడ్డుకున్నయ్. నిజాం షుగర్ ఫ్యాక్టరీతో నాకు విడదీయలేని బంధం ఉంది. 1996లో రైతులు నన్ను ఎన్ఎస్ఎఫ్‌కు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఎంపీగా గెలిస్తే పార్లమెంట్‌లో గళమెత్తి చెరుకు రైతుల మేలు కోసం పాటుపడుతా. పసుపు బోర్డు అంశంపై కొట్లాడి నిజామాబాద్‌లోనే ఏర్పాటయ్యేలా కృషి చేస్తా.

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై మీకున్న పట్టు ఎలాంటిది?

నిజామాబాద్ లోక్‌సభ పరిధి నాకు కొట్టిన పిండి. ఈ ప్రాంత ప్రజలతో దశాబ్దంగా నాకు పరిచయాలున్నాయి. మరోవైపు జగిత్యాల జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాకు ఆత్మీయత, అనురాగాలు పంచే బంధుత్వాలున్నాయి. మా అమ్మమ్మ ఊరు జగిత్యాల జిల్లాలోనే ఉంది. నా బాల్యం అక్కడే గడిచింది. గతంలో బాన్సువాడ, ఆర్మూర్, మొన్నటి వరకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా సేవలందించా. బాన్సువాడ టెక్నికల్‌గా జహీరాబాద్ లోక్‌సభకు వెళ్లినా అందులోని కొన్ని గ్రామాలు నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోకి వస్తాయి. ఈ ప్రాంతంపై నాకు పట్టుంది. అంతకుమించి బీఆర్ఎస్ అనే బలమైన శక్తి నావెంట ఉంది. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, ఆశన్నగారి జీవన్‌రెడ్డితోపాటు బోధన్‌లో షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, జడ్పీ చైర్మన్ విఠల్ రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జగిత్యాల బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు నాకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. ఐక్యంగా ప్రచారంలో దూసుకుపోతున్నాం.

కాంగ్రెస్ పాలనపై ప్రజలేమంటున్నరు?

కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని జనం తిడుతున్నరు. ఆరుగ్యారెంటీలను తుంగలో తొక్కి మోసంచేస్తున్న రేవంత్‌రెడ్డి తీరును ఎండగడుతున్నరు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసా కింద ఎకరానికి రూ.15వేలు, మహిళలకు రూ.2500, పింఛన్లు రూ.4వేలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వకపోవడంపై ప్రజలు అసంతృప్తితో రగిలిపోతున్నరు. మళ్లీ కేసీఆర్ వస్తేనే బాగుంటుందని ప్రజలంతా ముక్తకంఠంతో కోరుకుంటున్నరు. రేవంత్‌రెడ్డి సీఎం సీట్లో కూర్చొని ఫక్తు రాజకీయాలు చేయడం, బూతులు మాట్లాడటం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదు. కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పచ్చి అవకాశవాది. పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచి నాలుగున్నరేండ్లలో ఈ ప్రాంతానికి ఒక్కసారి కూడా తన ముఖం చూపించలేదు. అలాంటోడు ఎంపీగా నిలబడ్డాడు. ఈ ప్రాంతానికి పైసా కూడా వెచ్చించని వ్యక్తికి నిజామాబాద్ వాసులు ఎందుకు ఓటెయ్యాలి?

సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

కుట్రతోనే కేసీఆర్ ప్రచారంపై నిషేధం

- మోదీ, రేవంత్ విద్వేష ప్రసంగాలు ఈసీ దృష్టికి రాలేదా?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విస్మయం

సూర్యాపేట, మే 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మాండలికాన్ని సరిగ్గా అర్థం చేసుకోని ఈసీ 48 గంటలపాటు ప్రచారం చేయకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై నిషేధం విధించడంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విస్మయం వ్యక్తంచేశారు. ఫేక్ వీడియోలు ప్రచారం చేస్తే రేవంత్‌కు నోటీసులతో సరిపెట్టి, కేసీఆర్‌కు మాత్రం ప్రచారంపై నిషేధం విధించడం సరికాదని అన్నారు. అదీగాక బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి క్రిషాంక్‌ను అరెస్టు చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. కేసీఆర్ చేపడుతున్న బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీ నేతల కాళ్ల కింద భూమి కంపిస్తుందని, అందుకే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇద్దరూ కలిసి కుట్ర చేసి ఈసీతో కేసీఆర్ ప్రచారాన్ని నిషేధించేలా చేశారని మండిపడ్డారు. గురువారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. మోదీ, రేవంత్ విద్వేష ప్రసంగాలు, ఫేక్ వీడియోలు ఈసీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు కార్మికుల పట్ల అవమానకరంగా మాట్లాడిన సందర్భంలో స్పందించిన కేసీఆర్ మాటలను వక్రీకరించారని పేర్కొన్నారు. కేసీఆర్ యాత్రలు చేపట్టడంతో ఛోటే భాయ్, బడే భాయ్ (రేవంత్, మోదీ)లకు వణుకుడు మొదలైందని ఎద్దేవా చేశారు. వీధి రౌడీల్లా మాట్లాడిన రేవంత్ స్వేచ్ఛగా తిరుగుతుంటే కేసీఆర్‌ను మాత్రం ఇంటికే పరిమితం చేయడం సరికాదని అన్నారు. రేవంత్ తెలంగాణ సంపదను ఢిల్లీకి పంపుతున్నాడని స్వయానా మోదీ అనడం ద్వారా ఆయనకు పక్కా సమాచారం ఉన్నట్టే కదా?, అలాంటిది రేవంత్ అవినీతిపై మోదీ విచారణ సంస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు చర్చకు రానీయకుండా పక్కదారి పట్టించడం కోసమే డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

రేవంత్ ఇచ్చిందీ గాడిద గుడ్డే!

- వంద రోజుల్లో 6 గ్యారెంటీలు అని మాట మార్చారు
- బీజేపీ ఏమీ ఇవ్వలేదని పదేండ్ల నుంచి మొత్తుకున్నం
- సీఎం రేవంత్ ఇప్పుడు ఇదే పాట పాడుతున్నారు
- రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలి
- సంగారెడ్డి జిల్లాలో రోడ్‌షోల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి జిల్లా గుమ్మిడిదల రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డి, మే 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చిందని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తన నాలుగు నెలల పాలనలోనూ తెలంగాణ ప్రజలకు గాడిద గుడ్డే ఇచ్చారని మాజీమంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లాలోని దౌల్తాబాద్, గుమ్మడిదల, బొల్లారంలో నిర్వహించిన రోడ్‌షోల్లో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు గాడిద గుడ్డే ఇచ్చిందని రేవంత్‌రెడ్డి చెప్తున్నారని, ఇదే విషయాన్ని బీఆర్ఎస్ పదేండ్లుగా చెప్తూనే ఉన్నదని తెలిపారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి రేవంత్ మాట మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, తులం బంగారం అని ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయని, వారికి శిక్ష పడాల్సిందేనని అన్నారు. బోనస్ ధర చెల్లించి రైతుల నుంచి కాంగ్రెస్ సర్కార్ పంటలను ఎందుకు కొనుగోలు చేయటం లేదని నిలదీశారు. రైతులు, ప్రజలను మోసంచేస్తున్న కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని, రాష్ట్ర భవిష్యత్తు కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. మతం పేరుతో బీజేపీ గెలవాలని ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి దుబ్బాక ఉపఎన్నికల్లో అడ్డగోలుగా హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, దుబ్బాకలో చెల్లని రూపాయి ఈ ఎన్నికల్లో చెల్లుతుందా? అని ప్రశ్నించారు. బీజేపీ అభ్యర్థి బ్లాక్ మెయిల్ రాజకీయాలు మనకు అవసరమా? అని ప్రజలను అడిగారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఉన్నత విద్యావంతుడు, మాజీ కలెక్టర్ అయిన వెంకట్రామిరెడ్డి తన కుటుంబ ఆస్తి నుంచి రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ప్రజలకు మంచి చేయాలన్న తపన ఉన్న వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. రోడ్‌షోలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు 'కమ్మలు' ఓటెందుకు వేయాలి?

- ఒక్క కారణమైనా చెప్పు రేవంత్
- ఖమ్మం, చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాల్లో పోటీకి ఒక్క కమ్మ అభ్యర్థీ దొరకలేదా?
- కమ్మకుల సమాజం పేరిట లేఖ
- సామాజిక మాధ్యమాల్లో వైరల్

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని కమ్మ కులస్థులు కాంగ్రెస్ పార్టీకి ఓటు ఎందుకు వేయాలో చెప్పాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కమ్మకుల సమాజం పేరిట సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖ ఒకటి సోషల్ మీడియా వైరల్ అవుతున్నది. కాంగ్రెస్‌కు ఓటెందుకు వేయాలో ఒక్క కారణమైనా చెప్పే దమ్ము రేవంత్‌కు ఉందా? అని అందులో ప్రశ్నించారు. కమ్మకులస్థులు అధికంగా ఉండే ఖమ్మం, చేవెళ్ల, మల్కాజిగిరిలో టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్‌కు ఒక్క అభ్యర్థి కూడా దొరకలేదా? అని నిలదీశారు. 'తెలంగాణలో ఆర్థికంగా, సామాజికంగా కమ్మలు అత్యంత ప్రభావిత వర్గమని మీరు భావించట్లేదా? మీ రాజకీయ ఉన్నతికి పునాది వేసింది కమ్మ కులస్థులు కాదా?' అని సూటిగా ప్రశ్నించారు. నాడు నారా చంద్రబాబునాయుడు చలువతో రేవంత్‌రెడ్డి కమ్మలను వాడుకొని ఈ స్థితికి వచ్చారని గుర్తుచేశారు. 'ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ, కమ్మ మీడియా సంస్థల దన్నుతో మీరు ఒక బలమైన నాయకుడిగా ఎదిగింది వాస్తవం కాదా? నువ్వు పీసీసీ అధ్యక్షుడైతే అక్కున చేర్చుకుంది మా నాయకురాలు రేణుకాచౌదరి కాదా? అని లేఖలో ప్రశ్నించారు.

ఒక్క కమ్మ అభ్యర్థీ దొరకలేదా?

'తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో 37 అసెంబ్లీ నియోజకవర్గాలను కమ్మ కులం ప్రభావితం చేస్తుందనే విషయం మీకు తెలియదా? లేదా, తెలిసి నటిస్తున్నారా? గత అసెంబ్లీ ఎన్నికల్లో కమ్మ కులస్థులు గంపగుత్తగా కాంగ్రెస్‌కే ఓటువేసిన విషయం మర్చిపోయారా? ఆ దన్నుతోనే మీరు సీఎం అయిన వాస్తవాన్ని అటకెక్కించారా?' అని ప్రశ్నించారు. 'ఎన్నికలు కాగానే నీ కులానికి మూడు మంత్రి పదవులు, 14 కార్పొరేషన్లు, 17 మంది అధికారులకు అత్యంత కీలక పోస్టులు ఇచ్చుకున్నావు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్మలకు అత్యంత బలమైనదనే విషయం మీకు తెలియదా? ఎంపీ ఎన్నికల్లో నీ రెడ్డి కులానికి 17 సీట్లలో ఏడు సీట్లను కేటాయించి నీ కుల పక్షపాతాన్ని నిరూపించుకున్నది వాస్తవం కాదా? రాష్ట్రంలో ఎంపీగా నిలబడేందుకు కమ్మ అభ్యర్థి లేరా? కమ్మలు ఎంపీ సీటుకు అర్హులు కారా?' అని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు ఈసారి గోరీ కడతం

'ఖమ్మం, చేవెళ్ల, మల్కాజిగిరి లాంటి ఒక్క స్థానంలో కూడా పోటీకి కమ్మం కులం నుంచి అభ్యర్థులు దొరకలేదా? లేదా నీ కుల పెత్తనాన్ని మా మీద రుద్దాలని నిర్ణయం తీసుకున్నావా? నీ కులానికి చెందిన నీ శత్రువు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడే కాకుండా నటుడు దగ్గుబాటి వెంకటేశ్ వియ్యంకుడు అయిన రఘురాంరెడ్డికి ఖమ్మం ఎంపీ సీటు ఇవ్వడానికి ఇష్టపడ్డావు కానీ, నీకు రాజకీయంగా, వ్యక్తిగతంగా ఔన్నత్యాన్ని ఇచ్చిన కమ్మ కులాన్ని పక్కన పెట్టడాన్ని మా కులం జీర్ణించుకోలేకపోతున్నది. రాష్ట్రంలో బలమైన ఓటు బ్యాంకు, ఆర్థిక పునాదులు కలిగిన మా కమ్మ కులం రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలో ఒక్కసారి పబ్లిక్ గా చెప్పే దమ్ము నీకు ఉందా? వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు గోరీ కట్టడమే మా ఆశయం అని తెలుసుకో రేవంత్‌రెడ్డి. జై కమ్మ.. జై ఎన్టీఆర్' అంటూ లేఖను ముగించారు.

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేటలో బుర్ర శంకర్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

కాంగ్రెస్ గూండాలను కాలమే శిక్షిస్తుంది

- వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
- బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- బీఆర్ఎస్ నాయకుడు శంకర్‌కు పరామర్శ

రామగిరి, మే 2: 'కాంగ్రెస్ గూండాలను కాలమే శిక్షిస్తుంది. అధికారం వచ్చిన ఐదు నెలల్లోనే ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ, బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. వాస్తవాలను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు. వాళ్లే తగిన బుద్ధి చెబుతారు' అని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రెండ్రోజుల క్రితం కాంగ్రెస్ నేతల దాడిలో గాయపడ్డ పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట తాజా మాజీ సర్పంచ్ భర్త బుర్ర శంకర్‌గౌడ్‌ను గురువారం ఆయన జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌తో కలిసి పరామర్శించారు. దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎంతటి దాడులకు తెగించినా బీఆర్ఎస్ కార్యకర్తలు సంయమనం పాటించాలని, బీఆర్ఎస్‌ది దాడుల సంస్కృతి కాదని సూచించారు. వారికి కచ్చితంగా కాలమే సమాధానం చెబుతుందని అన్నారు.

కాంగ్రెస్ 'సోషల్' సభ్యుల అరెస్టు

- రోజంతా కొనసాగిన సస్పెన్స్
- ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేయకుండా ఉండేందుకే గోప్యత అనే ప్రచారం!

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా విభాగానికి చెందిన ఆరుగురు ప్రతినిధులను సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అయితే, ఈ అరెస్టుపై సైబర్ క్రైమ్ పోలీసులు స్పష్టత ఇవ్వడం లేదు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రిజర్వేషన్లపై మాట్లాడిన వీడియోను మార్ఫింగ్ చేశారని బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ప్రేమెందర్‌రెడ్డి గతనెల 27న ఇచ్చిన ఫిర్యాదుపై సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే విషయంపై ఢిల్లీలో బీజేపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై ఢిల్లీ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులకు, సోషల్‌మీడియా ప్రతినిధులకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇదే కేసులో ఢిల్లీ పోలీసులు నిందితులను అరెస్టు చేసేందుకు వస్తున్నారనే సమాచారంతో హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయమే కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న మన్నె సతీశ్, నవీన్, తస్లీమా, గీత, శివ, ఆస్మాలను అదుపులోకి తీసుకున్నారు. వారిని ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు విచారించి పలు వివరాలు సేకరించారు. అయితే రాత్రి వరకు కూడా ఉన్నతాధికారులు ఎవరూ ఫోన్ లిఫ్ట్ చేయలేదు, అరెస్టు చేశారా? ఇంకా విచారిస్తున్నారా? నోటీసులు ఇచ్చారా? అనే విషయంపై స్పష్టత కోసం ప్రయత్నించినా అధికారుల నుంచి స్పందన లేదు. అదుపులో తీసుకున్న మాట వాస్తవమని అంతకుముందే అధికారులు నిర్ధారించారు.

ఎందుకీ గోప్యత అంటే?

కేంద్ర హోంమంత్రి వీడియోను మార్ఫింగ్ చేసిన కేసులో దర్యాప్తును ఢిల్లీ సైబర్‌క్రైమ్ పోలీసులు వేగంగా చేశారు. నోటీసులు జారీ చేయడమే కాకుండా సోషల్‌మీడియాలో కీలకంగా వ్యవహరించి మార్ఫింగ్ చేసిన వారిని గుర్తించి అరెస్టు చేసేందుకు సిద్ధమయ్యారు. దీనిని గుర్తించిన తెలంగాణ పోలీసులు... ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయకుండా ఉండేలా ముందుగానే తమ అదుపులోకి తీసుకున్నట్టు చర్చ జరుగుతున్నది.

ఆదిలాబాద్ జిల్లా ధనోరలో రూ.4 వేల పింఛన్ వస్తలేదని చెబుతున్న వృద్ధురాలు ఆశక్క

నాలుగువేల పింఛన్‌పై ఆశక్కకు ఆశలేదు!

- కేసీఆర్ 2 వేలిచ్చినా తృప్తిగా ఉన్నం
- ఐదు నెలలైనా 4 వేల పింఛన్ ఏది?
- సర్కార్‌పై వృద్ధురాలి మండిపాటు

ఆదిలాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని ఓ వృద్ధురాలు మండిపడింది. నాలుగు వేల పింఛన్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా మాట నిలబెట్టుకోలేదని మండిపడింది. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు గురువారం ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం ధనోరలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్నం ఆశక్క అనే వృద్ధురాలి వద్దకు వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరగా.. తప్పకుండా కారు గుర్తుకే వేస్తానని చెప్పింది. రేవంత్ సర్కార్‌ను తూర్పారబట్టింది. పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామన్న కాంగ్రెస్ మాట తప్పిందని మండిపడింది. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 వేల పింఛనే వస్తుందని తెలిపింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ పెంచుతుందనే నమ్మకం లేదని వాపోయింది. కేసీఆర్ అమలు చేసిన రూ.2 వేల పింఛన్‌తోనే తృప్తిగా బతుకున్నట్టు తెలిపింది.

ఉప్పల్ స్టేడియంలో మళ్లీ కరెంట్ కట్

- కార్పొరేట్ బాక్సుల్లో గంటకు పైగా అంతరాయం
- నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రేక్షకులు
- ప్రపంచవ్యాప్తంగా పరువు తీస్తున్నారంటూ ఆవేదన

ఉప్పల్, మే 2 (నమస్తే తెలంగాణ): కరెంట్ కోతలు ఉప్పల్ స్టేడియాన్ని వీడటం లేదు. గతంలో హెచ్‌సీఏ కరెంట్ బిల్లు చెల్లించలేదని విద్యుత్తు సరఫరాను తొలగించామని స్వయంగా విద్యుత్తు అధికారులు చెప్పగా, తాజాగా మరోసారి ఉప్పల్ స్టేడియంలో కరెంట్ సమస్య తలెత్తింది. గురువారం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి కరెంట్ సరఫరా లేక అభిమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్పొరేట్ బాక్సుల్లో గంటకు పైగా కరెంట్ సరఫరా నిలిచి చీకట్లు అలుముకున్నాయి. ఈ సమయంలో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టి కరెంట్‌పైకి మళ్లింది. ప్రపంచ దిగ్గజ క్రికెటర్ల ముందు విద్యుత్తు సమస్య తలెత్తడం సిగ్గుచేటని పలువురు చర్చించుకుంటున్నారు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి టికెట్లు కొన్నామని, మ్యాచ్ వీక్షిద్దామని వస్తే కరెంట్ లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నామని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలే ఉష్ణోగ్రతలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ తరుణంలో కరెంట్ పోవడం తమను మరింత బాధకు గురిచేసిందని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కరెంట్ ఎందుకు కట్ చేశారంటూ స్టేడియం యాజమాన్యంతో ఘర్షణకు దిగినట్టు తెలిసింది. గతంలో ఉప్పల్ స్టేడియం వేదికగా హైదరాబాద్, చైన్నై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కూడా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కొన్నినెలల నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో ఉప్పల్ స్టేడియానికి విద్యుత్తు సరఫరాను నిలిపివేసినట్టు ఆనాడు అధికారులు తెలిపారు. రూ.1.57 కోట్లు విద్యుత్తు బిల్లులు హెచ్‌సీఏ చెల్లించలేదని విద్యుత్ అధికారులు ఆరోపించిన విషయం తెలిసిందే.

సిద్దిపేటలోనే రుణమాఫీ సభ

- హరీశ్.. రాసి పెట్టుకో: రేవంత్
- ఈసారి ఒట్టు కొమరవెల్లి మల్లన్నపై

సీఎం సిద్దిపేట రోడ్‌షో ఏరియాలో అప్రమత్తంగా విద్యుత్తు అధికారులు, సిబ్బంది

సిద్దిపేట/కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కొమురవెల్లి మల్లన్న సాక్షిగా ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రు